# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు.
- దివ్యాంగ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- రైతు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
- పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

======================

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం అందరికీ కొత్త ఉత్సాహాన్ని, ఉజ్వల భవిష్యత్‌ను తెస్తుందని ఆశిస్తున్నట్లుగా పేర్కొన్నారు. నూతన సంవత్సరం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి, ఐశ్వర్యం, సామరస్యం, ఆనందాన్ని కలిగిస్తుందని విశ్వసిస్తున్నానని తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం ప్రతి ఇంటికీ కొత్త ఆశలు, లక్ష్యాలు తీసుకురావాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలిగి జీవించాలన్నారు.

======================

దివ్యాంగ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో 12 లక్షల 75 వేల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో దివ్యాంగ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులతో పాటు మంగళగిరి నుంచి పెనుమాక వరకు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా

ప్రయాణించవచ్చునని అన్నారు. ఈ పథకం ద్వారా నెలకు ఒక్కొక్కరికీ 2 వేల రూపాయల దాకా దివ్యాంగులకు ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

=====================

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే "దివ్యాంగ శక్తి" పథకం లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, రోజువారీ అవసరాల కోసం దివ్యాంగులు స్వేచ్ఛగా ప్రయాణించగలరని మంత్రి తెలియచేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

విత్తనం నుండి విక్రయం వరకు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రైతుల ఇంటింటి సందర్శన వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కాపవరం గ్రామంలో మంత్రి ఈ రోజు విస్తృతంగా పర్యటించారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు అవసరాలు, ఎరువుల లభ్యత తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేస్తున్న మేలును వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. కాపవరం పర్యటనలో భాగంగా స్థానిక రైతుల విజ్ఞప్తి మేరకు సుమారు 600 ఎకరాల ఆయకట్టుకు వెళ్లేందుకు వీలుగా 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పుంత రోడ్డు పనులను, అలాగే 'పల్లె పండుగ' పథకం కింద నిర్మించిన గోకులం షెడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం మార్టేరు-ప్రక్కిలంక ప్రధాన రోడ్డు పనులను పరిశీలించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

విరామం

=====================

గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోని వివిధ ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి అమరావతిలో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునరావాస పరిహార ప్యాకేజీ మూడవ విడతలో భాగంగా నిర్వాసితులకు 226 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గత 21 నెలల్లో పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామని చెప్పారు. వారం రోజుల వ్యవధిలో డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు. అదే విధంగా పోలవరం నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. నదుల అనుసంధానం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

=====================

హెచ్ఐవీ నియంత్రణలో పురోగతిని వేగవంతం చేసే ప్రయత్నాలలో భాగంగా విజయవాడలో రాష్ట్ర స్థాయి `సురక్షా సంకల్ప కార్యశాల`ని ఈ రోజు నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (NACO) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యశాలకు ఎన్ఏసీఓ (NACO) డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ గుప్తా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (APSACS) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే. నీలకంఠ రెడ్డితో పాటు ఎన్ఏసీఓ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేశ్ గుప్తా

మాట్లాడుతూ... ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఎయిడ్స్‌ను పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అవసరమన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ప్రస్తుతం హెచ్ఐవీ వ్యాప్తి 0.58 శాతంగా ఉందని అధికారులు తెలిపారు. జాతీయ హెచ్ఐవీ కార్యక్రమం కింద గుర్తించిన `ప్రాధాన్య జిల్లాల` జాబితాలో ఆంధ్రప్రదేశ్ ను ప్రాధ్యాన్య రాష్ట్రంగా గుర్తించారు.

======================

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఈ రోజు  ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి కొత్త అమావాస్య మహోత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి  కొల్లు రవీంద్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సంయుక్త కలెక్టర్ పటేల్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ  తదితరులు పాల్గొన్నారు.

======================

ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు, బూత్ లెవల్ అధికారులకు (బీఎల్వోలు) విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. విశాఖ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పని చేస్తున్న అధికారులు, బీఎల్వోలకు స్థానికంగా ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చి.. ఖచ్చితమైన మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఎటువంటి డూప్లికేట్లు, లోపాలు లేకుండా డేటాను సరిచూడాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా.. ఖచ్చితత్వంతో కొనసాగాలని, ప్రతి దశలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

======================

గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి దక్షిణ అంతర కర్ణాటక వరకు తమిళనాడు అంతర్భాగంగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావారణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

======================

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ నెల 24న జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డాక్టర్ కె. శ్రీధర్ రావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశాల మేరకు శాప్ లీగ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను ఈ నెల 30, 31వ తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ అథ్లెటిక్స్ (మాస్టర్స్) క్రీడా పోటీలకు జిల్లా తరపున పంపిస్తామని పేర్కొన్నారు.

======================
======================